జోరుగా అక్రమ నీటి దందా

- వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్లలో పరిశ్రమలకు తరలింపు
- అధికారుల హెచ్చరికలు బేఖాతర్
- ధనార్జనే ధ్యేయంగా వ్యాపారుల ఆగడాలు

ఇంద్రకరణ్, చేర్యాల్, ఓడీఎఫ్ పరిధిలో ట్యాంకర్‌లో నీటిని నింపుతున్న దృశ్యం

కంది, మార్చి 11: కంది మండలంలో అక్రమ నీటి దందా జోరుగా కొనసాగుతున్నది. పంట పొలాలు, తాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన నీటిని పరిశ్రమలకు తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు పరిశ్రమలతో ఒప్పందం చేసుకొని రోజుకు వందల సంఖ్యలో ట్యాంకర్ల నీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కంది, కాశీపూర్, కలివేముల, జూలకల్, చిమ్నాపూర్, ఆరుట్ల, ఎర్ధనూర్, చేర్యాల్, కౌలంపేట, ఇంద్రకరణ్ తదితర గ్రామాల్లో అడ్డూ.. అదుపులేకుండా యథేచ్ఛగా నీటి వ్యాపారం జోరుగా కొనసాగుతున్నది. కొందరు దళారులు రైతులను మభ్యపెట్టి వ్యవసాయ బోర్ల నుంచి నిత్యం లక్షల లీటర్ల నీటిని తోడేస్తున్నారు. ఒక్క ఇంద్రకరణ్ గ్రామంలోనే రోజూ 40నుంచి 50ట్యాంకర్ల నీటిని పరిశ్రమలు తరలిస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

కంది మండలంలో అసలే నీటి కొరత, దీనికితోడు వేసవివారవడంతో భూగర్భ జలాలన్నీ అడుగంటిపోతున్నాయి. చెరువులు, కుంటలు ఎండుమొఖం పట్టాయి. పంట పొలాలకు పారాల్సిన నీరు పరిశ్రమలు, వాటర్ ప్లాంట్లకు తరలిపోతున్నది. సాగునీరు లేక పంటలన్నీ ఎండిపోయి బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. అక్రమ నీటిదందా కట్టడి కాకపోతే తాగు, సాగునీటికి కటకట తప్పదు.

పట్టించుకోని వ్యాపారులు

అక్రమ నీటి దందాపై రెవెన్యూ అధికారులు దాడులు చేసి జరిమానాలు విధించి హెచ్చరించినా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు అక్రమార్కులు ఒకటి రెండు రోజులు ఆగి, మళ్లీ రాత్రింబవళ్లు నీటి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అక్రమ నీటి వ్యాపారానికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో దారుణ పరిస్థితి తలెత్తక తప్పదు. ట్యాంకర్ల రాకపోకలతో వచ్చే దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతింటున్నాయి. గతంలో రైతులు ఆందోళనలు చేసి అడ్డుకున్న సంఘటనలు ఉన్నాయి.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

కొండాపూర్, మార్చి 11 : వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కొండాపూర్ ఎంపీపీ మనోజ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కొండాపూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైన ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడొద్దన్నారు. అలాంటి సమస్యలు ఎక్కడ వచ్చినా వెంటనే పరిష్కరించాలని సూచించారు. మల్కార్ ఎంపీటీసీ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ సంపును ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కొండాపూర్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ మండల వైద్యాధికారి సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీవో జ్యోతిలక్ష్మి, తహసీల్దార్ అనిత, జడ్పీటీసీ పద్మావతీపాండురండం, మార్కెట్ కమిటీ చైర్మన్ కమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలి

కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘువాల్

సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

కంది, మార్చి 11: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ పిలుపునిచ్చారు. సోమవారం కంది శివారులోని ఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

బీజేపీ మ్యానిఫెస్టో రూపొందించేందుకు మేధావులు, న్యాయవాదులు, వర్తక, వ్యాపారులతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరి అభిప్రాయాలకనుగుణంగా మ్యానిఫెస్టో రూపొందిస్తామన్నారు. సదస్సులో రఘునందన్‌రావు, గోదావరిఅంజిరెడ్డితో పాటు మెదక్, సిద్దిపేట జిల్లా నాయకులు, మేధావులు పాల్గొన్నారు.

వ్యర్థ జలాలను పరిశీలించిన ఎంపీవో

హత్నూర, మార్చి11 : నస్తీపూర్ శివారులోని బీసీ వసతిగృహం సమీపంలో మురికికూపంగా మారి దుర్వాసన వెదజల్లుతున్న వ్యర్థ జలాలను హత్నూర ఎంపీవో సువర్ణ సోమవారం పరిశీలించారు. 'వ్యర్థజలాలతో విద్యార్థుల ఇక్కట్లు' అనే వార్త కథనం నమస్తే తెలంగాణ దినపత్రికలో రావడంతో సోమవా రం ఎంపీవో సువర్ణ అక్కడకు చేరుకొని పరిశీలించారు. దౌల్తాబాద్ చౌరస్తాలోని దుకాణాలు, హోటళ్ల నుంచి విడుదలవుతున్న వ్యర్థజలాల వల్ల దుర్వాసన వస్తుందన్నారు. త్వరలోనే అదనంగా పైప్ లైన్ ఏర్పాటు చేసి ఇంకుడుగుంత తవ్వించి వ్యర్థ జలాలు అందులోకెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దుర్వాసన వెదజల్లుతున్న వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న ఎంపీవో సువర్ణ

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

నారాయణఖేడ్, మార్చి 11: నారాయణఖేడ్ పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.5 కోట్లతో బసవేశ్వర చౌక్ నుంచి మంగల్‌పేట్ ముదిరాజ్‌భవన్ వరకు, రూ.2కోట్లతో పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి మున్సిఫ్ కోర్టు వరకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారాయణఖేడ్ మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, ప్రజల అవసరాలను గుర్తించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. తాగునీటి విషయంలో వాటర్‌గ్రిడ్ ద్వారా నిధులు మంజూరు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. ఇటీవల కలెక్టర్ వల్లూరు క్రాంతి నారాయణఖేడ్ వచ్చిన సందర్భంగా బాలసదనం సందర్శించి బాలసదనం నూతన భవన నిర్మాణానికి రూ.1.36 కోట్లు మంజూరు చేశారని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

ఉపాధిహామీ పనుల పరిశీలన

నిజాంపేట్ మార్చి11: నిజాంపేట్ మండలకేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాల వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి పరిశీలించారు. సోమవారం ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాల వద్దకెళ్లిన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కూలీలతో మాట్లాడారు. పని గంటల బట్టి వేతనం ఉంటుందని చెప్పారు. అందరూ ఏడు గంటల నుంచి పన్నెండు గంటల వరకు పనిచేయాలని సూచించారు. సాంకేతిక సహాయకులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు కొలతలను కూలీలకు వివరించాలన్నారు. ఆమె వెంట ఓపీవో మణిక్‌రావు, మాజీసర్పంచ్ జగదీశ్వర్ చారి ఉన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి

ఇసుక అక్రమ రవాణాపై దాడులు

సంగారెడ్డి, మార్చి11: ఇసుకను అక్రమంగా తయారు చేసి రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సీ చెన్నారి రూపేశ్ అన్నారు. సోమవారం మండలంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన శంకర్‌నాయక్ తరలిస్తున్న ఇసుక లారీలను టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ మాట్లాడుతూ అక్రమ ఇసుక, మట్టీ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా అడ్డదారిలో రవాణా చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు ఉంటాయన్నారు. అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలని, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు లారీలను సీజ్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు లారీలను పట్టుకొని, డ్రైవర్లు కంశెట్టి ఏండ్లు, సైలాని సాబ్ పాటిల్‌ను విచారణ చేస్తున్నమని ఎస్సీ వెల్లడించారు.

అన్ని రంగాల్లో రాణించాలి

సదాశివపేట, మార్చి 11: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ మహిళా శక్తి సామర్థ్యం గొప్పదన్నారు. మహిళా అభివృద్ధి అంటే తెలివి, విలువలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారన్నారు. అంతకు ముందు కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మహిళలను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణాపాటిల్, కమిషనర్ ఉమ, మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, తదితర నాయకులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

సదాశివపేట, మార్చి 11: గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో చింతా ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో దశరథ్, శేఖర్, సంజీవులు, రాంచందర్, పోచయ్య, సాయిలు, మహిపాల్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో సంబురాలు

సంగారెడ్డి, మార్చి 11: ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం 21శాతం పీఆర్సీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ డిపో ఎదుట ఉద్యోగులు పటాకులు కాల్చి, మిఠాయిలు తినిపించుకొని సంబురాలు చేసుకున్నారు. సోమవారం సంగారెడ్డి డిపో ఆవరణలో రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా, ఇతర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ నేడు జరిగే క్యాబినెట్ సమావేశంలో 21శాతానికి బదులు 25శాతం పిట్‌మెంట్ ఇవ్వాలని, సీసీఎస్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్ఆర్టీ డబ్బులు కూడా ఇవ్వాలని కోరారు. యూనియన్లను పునరుద్ధరించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే తేదీని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో అనంతకిషన్, కూన సంతోశ్‌కుమార్, కసిని రాజు, డిపో మేనేజర్ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

హత్నూర, మార్చి11: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హత్నూర తహసీల్దార్ ఫర్వీన్ షేక్ తెలిపారు. సోమవారం హత్నూర మండలం కొత్తగూడెంలో గ్రామసభ ద్వారా రైతుల భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, భూసమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రాయికోడ్, మార్చి 11: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని రాయికోడ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కుళ్లిపోయిన మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారన్నారు. మృతుడికి 55 సంవత్సరాలు ఉండవచ్చునని, వైట్ కలర్ షర్ట్, దోతి ధరించి, బట్టతల, వైట్‌కలర్ వెంట్రుకలు ఉన్నాయన్నారు. మృతుడు వారం రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చునని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, వివరాల కోసం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 11: ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు ఫిర్యాదులను అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 100 అర్జీలు అందాయి. ఆయా దరఖాస్తులను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో పరమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 11: యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు ఖాళీ సంచుల కొరత లేకుండా చూడాలన్నారు.

అన్ని ధాన్యం కేంద్రాల్లో తేమశాతాన్ని పరిశీలించే యంత్రాలు, తూర్పారబట్టే యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తాలులేకుండా ఉండేలా రైతులను చైతన్యం చేయాలన్నారు. జిల్లాలో ఐకే పీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో 84, పీఏసీఎస్-76, డీసీఎంఎస్-32కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, డీఏం సివిల్ సప్లయ్ అధికారి ప్రశాంత్, డీసీవో ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనంతరం పరిశ్రమల శాఖ, అగ్నిమాపక శాఖ, పీసీబీ అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణ కోసం రెండు సేఫ్టీ బృందాలను ఏర్పాటు చేయాలని, మొదటి బృందం బొల్లారం, గడ్డపోతారం, రెండో బృందం పాశమైలారం, పటాన్‌చెరు పారిశ్రామికవాడల్లో భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు రవికిరణ్, ప్రశాంత్, లక్ష్మీకుమారి, యాదయ్య పాల్గొన్నారు.

ఏప్రిల్ 9న ఉగాది

పటాన్‌చెరు, మార్చి 11: ఉగాదిని ఏప్రిల్ 9న నిర్వహించేందుకు పటాన్‌చెరు పట్టణ ప్రముఖులు నిర్ణయించారు. సోమవారం పట్టణంలోని కోదండ సీతారామస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ జైపాల్ హాజరయ్యారు. వేదపండితుల సూచనల మేరకు మార్చి 25న హోలీ, ఏప్రిల్ 9న ఉగాది, ఏప్రి ల్ 15నుంచి 19వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్లు సఫానదేవ్, శంకర్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పటాన్‌చెరు డివిజన్ 113లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు.



సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

వెంకట్‌ఖ్వాజా ఆశ్రమంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

వట్‌పల్లి, మార్చి 11: మండలంలోని వెంకట్‌ఖ్వాజా ఆశ్రమంలో మూడు రోజులుగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆశ్ర మ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేసిందన్నారు. అధికారంలో లేకపోయినా అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైర్మన్ జైపాల్‌రెడ్డి, వీరారెడ్డి, శివాజీరావు, వినోద్‌గౌడ్, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

వట్‌పల్లి : వెంకట్‌ఖ్వాజా ఆశ్రమంలో పూజలు చేస్తున్న మాజీఎమ్మెల్యే క్రాంతి కిరణ్

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

బొల్లారం మార్చి 11: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిన్నారం తహసీల్దార్ భిక్షపతి అన్నారు. సోమవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 284 సర్వే నంబర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీబీతో కూల్చివేయించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాశ్ నారాయణ, సర్వేయర్ రామభద్రం, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి కొరత రాకుండా చూడాలి

అందోల్, మార్చి 11: వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జోగు బాలయ్య అధికారులకు సూచించారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేసే ప్రత్యేక అధికారులు నీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పారిశుధ్య పనులను ఎప్పట్టికప్పుడూ పర్యవేక్షిస్తూ పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు. మనఊరు మనబడిలో చేపట్టిన పనులకు వచ్చిన బిల్లులను పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నడుస్తున్నాయని, వాటిని నియంత్రించాలని జడ్పీటీసీ రమేశ్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ బాలయ్య

జాతర పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

జిన్నారం, మార్చి 11: జిన్నారం పంచాయతీ పెద్దమ్మగూడెంలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న మల్లన్న, రేణుకాఎల్లమ్మ జాతర పత్రికను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేకు పత్రికను అందజేసి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. జాతరలో శనివారం గంగాపటం, ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణం, సోమవారం నాగవెళ్లి, మంగళవారం రేణుకాఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుడికుంట పరిశీలన

బొల్లారం, మార్చి11: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కుడికుంటను ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈమేరకు కుడికుంటలో చేపడుతున్న బతుకమ్మ ఘాట్ పనులను అధికారులు పరిశీలించారు. బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనుల అనుమతులపై ఇరిగేషన్ డీఈ రామస్వామి విచారణ చేపట్టారు. కుడికుంట రక్షణ చర్యల్లో భాగంగా సమగ్ర విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిన్నారం తాసీల్దార్ భిక్షపతి, కమిషనర్ మంగతాయారు, ఏఈలు శ్రీకాంత్, దిలీప్, ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, సర్వేయర్ రామభద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గుమ్మడిదల, మార్చి11: పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని బీఆర్ఎస్ మండల నాయకుడు నరహరి విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలంలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల కోసం బీఆర్ఎస్ నాయకుడు నరహరి ప్యాడ్లు, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

జిన్నారం, మార్చి 11 : మండలంలోని ఊట్ల గ్రామంలో శివరాత్రి నుంచి మల్లన్న ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం రేణుకాఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారులు రేణుకాఎల్లమ్మ చరిత్రను కథారూపంలో తెలియజేశారు. సాయంత్రం మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలు చివరిరోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు.

బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

2,382 దరఖాస్తులు

నారాయణఖేడ్, మార్చి 11: ప్రభుత్వం చేపట్టిన ధరణి రికార్డుల ప్రక్షాళనలో నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,382దరఖాస్తులు వచ్చాయని ఆర్డీవో అశోకచక్రవర్తి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో వివిధ కారణాలతో ఆగిపోయిన భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి 1,764 సమస్యలను పరిష్కరించగా, మరో 618 పరిష్కరించాల్సి ఉందన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో అశోకచక్రవర్తి

ఆరోగ్య కేంద్రం తనిఖీ

రాయికోడ్, మార్చి 11: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ మొగులప్ప అన్నారు. సోమవారం రాయికోడ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రజలకు సరైన వైద్యసేవలు అందించి వారి మన్ననలు పొందాలన్నారు. సమావేశంలో ప్రాథమిక వైద్యాధికారి నికిలా, సిబ్బంది ఉన్నారు.

రాయికోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేస్తున్న ఎంపీపీ మొగులప్ప

డాక్యుమెంట్ పోయినది

కడావత్ జనాబాయి, భర్త. ఎల్.రాములు, R/o. సర్వే నం. 34/A2, ప్లాట్ 8, బీబీపేట్ (గ్రా||), జమ్లా నాయక్ తాండా, కల్హేర్ (మం), సంగారెడ్డి జిల్లా వాసినైన నేను 04-03-2024న బీబీపేట్ గ్రామం నుండి నారాయణఖేడ్‌కు ప్రయాణిస్తుండగా నం. 06/2008 కలిగిన నా ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికితే సంప్రదించండి.

సెల్: 9010151584

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)

జహీరాబాద్ శాఖ

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్